

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (శుక్రవారం సాయంత్రం)
సహర్ 5:03 (శనివారం ఉదయం)

న్యూస్ బాక్స్

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంతంగా ముగిసాయని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన తెలిపారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, పరీక్షలకు 4532మంది హాజరు కావాల్సి ఉండగా, 4428మంది హాజరుకాగా, 104మంది గైర్హాజరు అయ్యారని, 97,7శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిదారులపై కొరడా
నాలుగు దుకాణాలు సీజ్



షాపును సీజ్ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

కోల్‌సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై కార్పొరేషన్ కొరడా ఝుళిపించింది. గురువారం లక్ష్మీనగర్‌లో ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించకుండా బకాయిలు ఉన్న నాలుగు దుకాణాలను సీజ్ చేశారు. అదనపు కమిషనర్ వెంకటస్వామి, ఆర్‌ఐ శంకర్‌రావు, ఖాజా, వార్డు ఆఫీసర్లు సంకీర్తన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

26న ఆలయ హుండీ లెక్కింపు

కమాన్‌పూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీఆదివరాహ స్వామి ఆలయహుండీని ఈనెల 26న ఉదయం 10గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు లెక్కింపులో హాజరు కావాలని కోరారు.

ప్రతిపాదనలకే సరి



- బడ్జెట్‌లో పత్తిపాక, పోతారం ప్రాజెక్టుల ఊసేలేదు
- శ్రీపాద ఎల్లంపల్లి మిగులు పనులకు రూ.350 కోట్లు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ 2685 కోట్లు
- ప్రాణహిత- చేవెళ్ళకు రూ.32 కోట్లు
- నిరాశలో జిల్లా రైతాంగం

జిల్లాలో పత్తిపాక రిజర్వాయర్, పోతారం ఎత్తిపోతల పథకాలకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయిస్తారని జిల్లా రైతులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. బుధ వారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 3,04,965 కోట్ల రూపాయలతో అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సాగునీటి పారు దల రంగానికి 23,373 కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించారు. జిల్లాలో ప్రతిపాదించిన పత్తిపాక రిజర్వా యర్, పోతారం ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించలేదు.

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)


పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి, మంథని, రామగుండం, కరీంనగర్ జిల్లా కరీంనగర్, చొప్పదండి, జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గాల్లోని దాదాపు రెండు లక్షల 10 వేల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు భూములను స్థిరీకరించడంతోపాటు కొత్తగా పది నుంచి 20 వేల ఎక రాలకు సాగునీరు అందించేందుకు ధర్మారం మండలం పత్తిపాక వద్ద 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. కాని పనులు ముందుకు సాగలేదు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పత్తిపాక రిజర్వాయర్‌ను నిర్మిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు.

జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కలు సైతం పత్తిపాక చేపడతామని హామీలు ఇచ్చారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సైతం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కలిసి నవంబర్ 23న పత్తిపాకను సందర్శించి ప్రతి పాదిత రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించారు. ఇందు కోసం సుమారు 2500 కోట్ల రూపాయలతో తాత్కాలి కంగా డీపీఆర్‌ను రూపొందించారు. బడ్జెట్లో ఈ రిజర్వాయర్‌కు నిధులు కేటాయిస్తారని ఆశించినప్పటికీ భంగపాటే ఎదురయ్యింది. నిధులు కేటాయించకున్నా ఎమ్మెల్యే విజయ రమణారావు చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించాలని రైతులు కోరుతున్నారు.

పోతారం ఎత్తిపోతలకు కేటాయించని నిధులు

మంథని నియోజకవర్గంలోని మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం మండలాల్లోని సుమారు 22 వేల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు కొత్తగా 8 వేల ఎకరాల భూములకు సాగునీటిని అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతి పాదించిన పోతారం ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. మంథని నియోజకవర్గ ప్రాంత రైతన్నలు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని చేపట్టక పోగా, కనీసం ఇప్పుడైనా పనులు ప్రారంభమవుతాయని ఆశించారు. బడ్జెట్లో నిధులు కేటాయించకపోయినా మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలనిరైతులు కోరుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి రూ.350 కోట్లు



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు మిగులు పనులకు ఈ బడ్జెట్లో ప్రభుత్వం 350 కోట్ల రూపాయల నిధులను కేటాయించింది. ఈ నిధులతో ప్రాజెక్టు ద్వారా రెండు లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యం నెరవేరే అవకాశాలు ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినప్పటికీ రెండో దశ జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో చేపట్టాల్సిన కాలువల నిర్మాణాలు, ఫీల్డ్ ఛానళ్లు, పలు రిజర్వాయర్ల పనులు పూర్తి కాలేదు. నిధుల కేటాయింపుతో

మిగతా 8వ పేజీలో

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో మొత్తం 41 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 7393 మంది
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు
- 5 నిమిషాలు ఆలస్యమైతే నో ఎంట్రీ



సుల్తానాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాజయ్య

పెద్దపల్లి కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి 12.30వరకు జరిగే పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో పరీక్ష రాసే 7,393మంది విద్యార్థుల కోసం 41పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో రెగ్యులర్‌గా పరీక్ష రాసే విద్యార్థుల్లో బాలురు 3703, బాలికలు 3690మొత్తం 7393మంది పరీక్షలు రాయనున్నారు. ఆరుగురు రూట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు మూడు టీంలు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతోపాటు 586మంది ఎనిమిది ఇన్విజిలేటర్లను కేటాయించారు. ప్రైవేటుగా పరీక్షలు రాసే అభ్యర్థుల్లో 8 మంది బాలురు 9మంది బాలికలు మొత్తం 17మంది రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు చేపట్టారు. విద్యార్థులు సకాలంలో హాజరయ్యే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారామెడికల్ సిబ్బంది, ఆశాకార్యకర్తలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో ఎక్కడ మాస్‌కాపీంగ్ జరగకుండా జాగ్రత్త తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేసే విధంగా చర్యలు చేపట్టారు.

కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాలలో సుమారు 2500 మంది విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకార్యలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలి పారు. ఉదయం 9.30గంటల తరువాత 5 నిమిషాలు గ్రేస్ సమయం ఉంటుందని, తరువాత హాజరయ్యే వారిని అనుమతించమని అధికారులు పేర్కొన్నారు. హాల్ టికెట్లను మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లలో తీసుకుని వచ్చినా అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌ను అనుమతి లేదు. ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్‌ను బయటనే ఉంచాలని పేర్కొన్నారు. ప్రతీ సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు విధులు నిర్వహిస్తారు.

ఈ నెల 25న కార్పొరేషన్ ఎదుట మహాధర్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గోదావరిఖని, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఈ నెల 25న రామగుండం కార్పొరేషన్ ఎదుట మహాధర్నాను నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు మహేశ్వరి, కుమారస్వామి చెప్పారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాలుగు డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపె సర్వేను నిర్వహించామని, చాలా చోట్ల నీటి సమస్య, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంత ఇల్లు లేక అద్దె ఇండ్లలో నివాసముండున్నారని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు లేవని, సీపీఎం ఆధ్వర్యంలో భూపోరాటం ద్వారా 600మందికి ఇండ్ల పట్టాలను ఇప్పించామని చెప్పారు. కార్పొరేషన్‌లో ప్రజలు అనేక సమస్యలపై బాధపడుతున్నారని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు, ఈ ధర్నాకు సీపీఎం ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లి హాజరవుతారని చెప్పారు. సారయ్య, అనూష, సృజన, భాస్కర్ పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

7



అడవులతోనే మనుగడ

- అంతరించి పోతున్న వన సంపద
- ఆహారం, నీటి కోసం జనారణ్యంలోకి వన్యప్రాణులు
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

7



ఆదాయం ఫుల్.. ఖజానా నిల్...

- ఆరేళ్ళుగా స్టాంప్ డ్యూటీ విడుదల చేయని ప్రభుత్వం
- కార్పొరేషన్ ద్వారా జమ అయ్యింది రూ.50 కోట్లు
- ఆర్ఎఫ్‌సీఎల్ చెల్లింపే రూ.34కోట్లు...
- ప్రభుత్వం విడుదల చేసింది రూ.16కోట్లు...



కోల్‌సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న స్టాంప్ డ్యూటీని ఆరేళ్లగా ప్రభుత్వం కార్పొరేషన్‌కు చెల్లించడం లేదు. నేరుగా ప్రభుత్వ ఖజానాకు మళ్లించుకుంటోంది. 2019 నుంచి ఈ వ్యవహారం మొదలైంది. నిబంధనల ప్రకారం ఆస్తుల కొనుగోలు, అమ్మకాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చెల్లించే స్టాంప్ డ్యూటీలో 90శాతం రామగుండం నగరపాలక సంస్థకు చేరాల్సి ఉంటుంది. గతంలో నెలకు సరాసరి రూ.35లక్షల నుంచి రూ.40లక్షల చొప్పున స్టాంప్ డ్యూటీ ఆదాయం వచ్చేది. స్టాంప్ డ్యూటీ సొమ్ముతోనే జీతాల సర్దుబాటు జరిగేది. పట్టణ ప్రగతి మొదలు పెట్టడంతో స్టాంప్ డ్యూటీ, మ్యూటేషన్ ఫీజులు, ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్‌లు తదితర పన్నులు నేరుగా ప్రభుత్వ ఖజానాకు వెళ్లాయి. ఇంత వరకు స్టాంప్ డ్యూటీ సొమ్ము మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఖజానాల్లో జమ కాలేదు.

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ఆర్ఎఫ్‌సీఎల్ 2021లో రూ.34.5కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లించింది. ఎఫ్‌సీఐ పరిధిలోని భూములు, ఆస్తులు, ఆర్ఎఫ్‌సీఎల్‌కు లీజుకు ఇచ్చినందుకు రూ.34.5కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లించారు. నిబంధనల ప్రకారం రూ.30కోట్ల పైన స్టాంప్ డ్యూటీ ఆ ఒక్క సంవత్సరంలోనే కార్పొరేషన్‌కు జమ కావాల్సి ఉంటుంది. 2019 నుంచి 2025వరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్టాంప్ డ్యూటీ రూ.50కోట్లపైనే వసూలైనట్లు తెలుస్తుంది. ఇందులో రూ.45కోట్లు రామగుండం నగరపాలక సంస్థకు రావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో పైసా విదిల్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల రామగుండం నగరపాలక సంస్థకు రూ.16కోట్ల స్టాంప్ డ్యూటీని విడుదల చేసింది. ఈ నిధులను కార్పొరేషన్ సాధారణ నిధుల్లోనే జమ చేయాల్సి ఉంటుంది. ఐటీ, జీఎస్‌టీ కింద బకాయిలు రూ.40లక్షలు ఇందులో నుంచి చెల్లించారు. గతంలో కార్పొరేషన్‌కు పరిశ్రమల నుంచి ఎక్కువ ఫీజులు వసూలు అయిన సందర్భంల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేవారు. వాటి వడ్డీతోనే వేతనాలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల ఎల్ఆర్ఎస్ ఫీజుల వడ్డీని కూడా అత్యవసర సమయాల్లో కార్పొరేషన్‌లో వీధి దీపాల కొనుగోలుకు వినియోగించారు. స్టాంప్ డ్యూటీ సొమ్ము ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా పెట్టుకుంటే భవిష్యత్‌లో కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాల ఇబ్బందులు తప్పనున్నాయి. దీంతో పాటు పలు అత్యవసర పనులు చేసేందుకు ఈ నిధులను వినియోగించాల్సి ఉంటుంది.

పట్టణ ప్రగతి బిల్లులకు చెల్లించాలని లేఖ

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో స్టాంప్ డ్యూటీ నుంచి ప్రభుత్వం విడుదల చేసిన రూ.16కోట్ల నుంచి పట్టణ ప్రగతి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు అనుమతి కోరుతూ కార్పొరేషన్ కమిషనర్ మున్సిపల్ శాఖకు లేఖ రాసినట్టు సమాచారం. కార్పొరేషన్‌లో పట్టణ ప్రగతి కింద ఇప్పటికే రూ.8కోట్ల బిల్లులకు చెక్కులు ఇచ్చారు. మరో రూ.8కోట్లకు సంబంధించి బిల్లుల చేయాల్సి ఉంది. పట్టణ ప్రగతి అకౌంట్‌లో నిధులు లేకపోవడంతో బిల్లులు చేయకుండ పెండింగ్‌లో పెట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన స్టాంప్ డ్యూటీని పట్టణ ప్రగతికి మళ్లించాలనే ఆలోచనలో యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ప్రభుత్వం స్టాంప్ డ్యూటీని విడుదల చేసింది. పట్టణ ప్రగతికి మళ్లింపు అనేది విధానపరమైన నిర్ణయం. ఒక వేళ మళ్లింపులు జరిగితే మళ్లీ సాధారణ నిధుల ఖాతాలో జమయ్యేందుకు అవకాశాలు కూడా లేవు.

ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ దేశానికే ఆదర్శం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్దత కల్పించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించి దేశానికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జెండా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు చేసిన పోరాటానికి దారిచూపిన ఘనత కాంగ్రెస్ దేనన్నారు. అందరినీ సమన్వయం చేస్తూ ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. 95 ఏళ్ళ తర్వాత తెలంగాణలో బీసీ కులగణన నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. బీసీ బిల్లును కేంద్రానికి పంపి పార్లమెంటులో చట్టబద్ధత పొందేవరకు పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ పోరాడాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. యువ వికాసం ద్వారా అర్హులైన యువతకు సబ్సిడీపై రుణాలు అందజేస్తామని తెలిపారు. పారదర్శకంగా పాలన చేస్తూ అభివృద్ధి, సంక్షేమం సాధిస్తుంటే బీఆర్ఎస్ నేత కేటీఆర్ కళ్ళు చెవులు లేని వాడిలా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేందుకు కాల్వల వెంట తిరుగుతున్నామని తెలిపారు. మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్ రావు, తిరుపతి రెడ్డి, నాయకులు గోపగాని సారయ్యా గౌడ్, మస్రత్, సురేష్ గౌడ్, సందనవేన రాజేందర్, బండారి సునీల్, ఆరె సంతోష్ , దొడ్డపల్లి జగదీష్, జాని, బొడ్డుపల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు.

సాగునీటిని సమర్థవంతంగా వినియోగించాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కింద యాసంగి నీటి సరఫరాకు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం డీ83 కాలువ కింద యాసంగి పంటకు నీటి విడుదలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సారెస్పీ కింద యాసంగికి 7 తడులలో 6 తడులను ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. ఎస్సారెస్పీ నుంచి ఆశించిన స్థాయిలో నీరు విడుదల కాకపోవడం, ఎండ తీవ్రత వల్ల కొంత నీరు ఆవిరి కావడం వల్ల చివరి ఆయకట్టు ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదన్నారు. అందుబాటులో ఉన్న నీటి నిల్వలను అధికారులు సమన్వయంతో జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, మంథని ఈఈ బాల రామయ్య పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో ప్రక్షాళన షురూ

- టాస్క్‌ఫోర్స్ నుంచే మొదలు
- కొత్త టీమును సిద్ధం చేసుకునేందుకు కసరత్తు

కోల్‌సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్‌లో కమిషనర్ ప్రక్షాళన మొదలుపెట్టారు. కమిషనరేట్‌కు ప్రధానమైన టాస్క్‌ఫోర్స్ నుంచే ప్రారంభించారు. టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న సిబ్బంది అందరిని మార్చారు. వివిధ ఠాణాల నుంచి డిప్యూటేషన్‌పై టాస్క్‌ఫోర్స్‌కు వెళ్లిన అందరిని తిరిగి ఠాణాలకు పంపారు. ఈ మేరకు ఆయా ఠాణాల్లో రిపోర్టు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. నేరుగా టాస్క్‌ఫోర్స్‌లో పోస్టింగ్ ఉన్న పలువురు హెడ్ కానిస్టేబుళ్ల, కానిస్టేబుళ్లకు ఠాణాల్లో పోస్టింగ్‌ల కోసం ఆప్షన్ అవకాశం ఇచ్చారు. టాస్క్‌ఫోర్స్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి కొత్త సిబ్బందితో కొత్త టీము ఏర్పాటు చేయాలనే ఆలోచనలో సీపీ ఉన్నట్టు తెలుస్తున్నది. గతంలో హైదరాబాద్ సౌత్‌జోన్‌లో పని చేసిన సమయంలో పకడ్బందీ టాస్క్‌ఫోర్స్ టీమును నిర్వహించారనే పేరున్నది. టాస్క్‌ఫోర్స్ టీముకు దేహదారుఢ్య శిక్షణతోపాటు ఇంటెలిజెన్స్ వ్యవస్థను అభివృద్ధి చేసుకునే విధంగా శిక్షణ ఇవ్వనున్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలు క్రైం పరంగా సమస్యాత్మక జిల్లాలుగా పేరున్నది. వీటి కట్టడికి పటిష్టమైన టాస్క్‌ఫోర్స్ అవసరం. ఇప్పటికే పలు ఠాణాల నుంచి ఆసక్తి ఉన్న, క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ కొత్త టీమ్‌లో చేరేందుకు కొత్తగా పోలీస్‌శాఖలో చేరిన జూనియర్లు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తున్నది. కొత్తగా పోలీస్‌శాఖలో చేరిన వారిలోఉన్నత విద్య అభ్యసించిన వారు అధికంగా ఉన్నారు. దీంతో పాటు ఇతర విభాగాల్లో కూడా ప్రక్షాళన జరిగే అవకాశం ఉంది. ఎస్‌బీ, సీసీఎస్ తదితర కీలక శాఖల్లో కూడా మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. మొత్తంగా టాస్క్‌ఫోర్స్ నుంచే ప్రక్షాళన మొదలు కావడంతో కమిషరేట్‌లో చర్చనీయాంశం అయ్యింది.

ఉరి వేసుకుని ఒకరి బలవన్మరణం


రాజయ్య (ఫైల్)

పెగడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన కొత్తూరు రాజయ్య (53) అనేవ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం తన కుటుంబంతో కలసి కరీంనగర్‌లో నివసిస్తున్న రాజయ్య బుధవారం మధ్యాహ్నం కరీంనగర్ నుంచి పెగడపల్లికి వచ్చాడు. అనారోగ్యం, మానసిక ఒత్తిడి వల్ల మద్యానికి బానిసైన రాజయ్య పెగడపల్లిలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గొడ్డలితో తల భాగంలో కొట్టుకొని, ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం సమీప బంధువులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి చూసేసరికి రక్తపు మరకలతో ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. మృతుడి కుమారుడు విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

థాయ్‌లాండ్‌లో చెల్పూర్‌వాసి మృతి


పుల్ల సృజన్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పుల్ల సృజన్(33) థాయ్‌లాండ్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ వారం రోజుల క్రితం మృతిచెందాడు. శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి రానుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్ల సృజన్ వృత్తిరిత్యా ఏషియన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉద్యోగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకుగాను కంపెనీ తరపున థాయ్‌లాండ్‌కు విహారయాత్ర వెళ్లాడు. జనవరి 25న థాయ్‌లాండ్‌లో సృజన్ రోడ్డుప్రమాదంలో గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన భర్తను స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల క్షతగాత్రుడి భార్య స్నేహ ఎమ్మెల్యేకు సైతం విన్నవించుకుంది. సృజన్ మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి రానుండటంతో గ్రామంలో విషాధఛాయాలు అలుముకున్నాయి. మృతుడికి భార్య స్నేహ, కుమార్తె ఉంది.

మూర్ఛవ్యాధితో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో గురువారం సాయంత్రం జుకంటి స్వామిప్రసాద్(38) అనే వ్యక్తి మూర్ఛవ్యాధితో మృతి చెందాడని ఒకటో టాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. కోతిరాంపూర్‌కు చెందిన స్వామిప్రసాద్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడని, రెండేళ్లక్రితం అతనిభార్య అనారోగ్యంతో మృతిచెదిందని తెలిపారు. అప్పటినుంచి స్వామిప్రసాద్ మనోవేదనతో మద్యంకు బానిసగా మారాడు. ఇంటికి కూడా రాకుండా ప్రభుత్వ ఆశ్రమంలో ఉండేవాడని మృతుడి సోదరుడు పోలీసు లకు ఇచ్చినఫిర్యాదులో పేర్కొన్నాడు. గురువారంసాయంత్రం స్టేడియంలో ఒక వ్యక్తి చనిపోయాడని సమాచారం అందగా వెళ్లి చూశామని, తమ సోదరుడు స్వామి ప్రసాద్‌గా గుర్తించినట్లు తెలిపారు. మూర్ఛవ్యాధి కారణంగానే మరణించి ఉంటాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రి మృతి


మల్లయ్య(ఫైల్)

మానకొండూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన కిన్నెర మల్లయ్య(56) అనే తాపీ మేస్త్రీ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పొరండ్లకు చెందిన మల్లయ్య శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో మేస్త్రీ పనిచేసి ఇంటికి తిరిగి వస్తున్నాడు. మండలంలోని శంషాబాద్ గ్రామశివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేత్రాలు దానం..

తిమ్మాపూర్: కిన్నెర మల్లయ్య నేత్రాలను హైదారాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి అసుపత్రికి కుటుంబ సభులుఉ దానం చేశారు. తన తండ్రి చనిపోయినా మరొకరి జీవితానికి నేత్రాలు ఉపయోగపడాలనే అశయంతో నేత్రాలను దానం చేసినట్లు మృతుడి కుమారుడు అనిల్ పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు, నాయకులు మృతుడి కుటుంబాన్ని అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి అల్కాపురికాలనీకి వెళ్లేదారిలోని మురికి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 41నుంచి 50సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కోతిరాంపూర్ డివిజన్‌లో శానిటరీ జవాన్‌గా పనిచేస్తున్న సుంకరి శ్రీనివాస్ గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో మురికి కాలువలో శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయిన స్థితిలో ఉందని కరీంనగర్ ఒకటో టాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. మృతుడిని గుర్తించినవారు వెంటనే కరీంనగర్ ఒకటో టాణా ఫోన్ నెం. 8331940591, 8712581999కు సమాచారం అందించాలని కోరారు.

వేములవాడలో ఒకరి మృతదేహం లభ్యం..

వేములవాడ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండల అగ్రహారం గ్రామ శివారులో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. అగ్రహారం గ్రామశివారులో గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బ్లూ కలర్ నిక్కర్ ధరించి కుడి కాలికి కడియం కలిగివున్నాడని గుర్తించారు. మృతుడి వివరాలు తెలిసినవాళ్లు వేములవాడ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

తాటిచెట్టుపై నుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలు

వీణవంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన నల్లగోని కనుకయ్య తాటిచెట్టుపై నుంచి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. కనుకయ్య వృత్తిలో భాగంగా కల్లు గీసేందుకు గురువారం తాటిచెట్టు ఎక్కాడు. ఒక్కసారిగా మోకు జారడంతో కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కనుకయ్య ఎడమకాలుకు, కుడిభుజానికి, కన్నుకు గాయాలయ్యాయి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో గురువారం అరతులం బంగారం, 10తులాల వెండి ఆభరణాలు చోరీజరిగినట్లు పోలీసులు, కాలనీ వాసులు తెలిపారు. కాలనీకి చెందిన కటుకం సరోజన బుధవారం ఇంటికి తాళంవేసి స్థానికంగా ఉన్నబంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం సరోజనఇంటికి రాగా తాళం పగులగొట్టిఉంది. చోరీజరిగినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనస్థలాన్ని ఎస్‌ఐశ్రీకాంత్ పరిశీలించారు. బీరువాలో ఉన్న అరతులం బంగారం, 10తులాల వెండి అభరణాలు అపహరణకు గురయినట్లు సరోజన పోలీసులకు పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కవిత్వమా వర్ధిల్లు





● నేడు ప్రపంచ కవితా దినోత్సవం ● ఈ యేడు శాంతి-ఐక్యత అంశంగా వేడుకలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హృదయ స్పందనకు అక్షరరూపమే కవిత్వం. కవులు, రచయితలు సమాజ సమస్యలను ఎత్తిచూపి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు కవిత్వాన్ని ఆయుధంగా వాడుతారు. సమాజ శ్రేయస్సే కవిత్వం పరమావధి. 1999లో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. ఈ యేడు శాంతి-ఐక్యత అంశం నినాదంగా వేడుకలు జరుపుకోవాలని యునెస్కో ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా కవితా రచన, పఠన, ప్రచురణ, బోధనా వ్యాసంగంలో చైతన్యం, జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ కవిత్వ ఉద్యమాల స్ఫూర్తిని పదిల పరచడమే కవితా దినోత్సవ లక్ష్యాలు. భాషా భిన్నత్వాల్ని కవితా ప్రచారంతో ఏకం చేసేందుకు ఈ దినోత్సవాన్ని ప్రతి యేటా నిర్వహిస్తుంటారు. అంతరించిపోతున్న భాషలను పునరుద్ధరించి భావితరాలకు అందించడం ఈ దినోత్సవ మరో ఉద్దేశం. కవిత్వలోతులు, అందాలు, పరమావధి తెలిసిన వారు ఇతరుల కవిత్వాన్ని ప్రోత్సహిస్తుంటారు. సాహిత్యంలో పట్టు లేని వారు సైతం కవితలను రాయొచ్చనే అంశాన్ని గుర్తులో ఉంచుకొని సమాజ సమస్యలు ఇతివృత్తంగా అద్భుత కవితలను అందరూ ఆవిష్కరించి ప్రతి ఒక్క సృజనకారుడు స్పందించాల్సిన అవసరం ఉంది. ఇతరులను కవితా రచనా దారుల వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే...



మానవులను అనుసంధానం చేస్తుంది

డాక్టర్ నలిమెల భాస్కర్, బహుభాషావేత్త, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

కవిత్వం మానవులను అనుసంధానం చేసి, హృదయ మాలిన్యాన్ని ప్రక్షాళన చేసే ప్రక్రియ. ప్రకృతిని, సమాజాన్ని, జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తూ చెప్పిన భావోద్వేగపూరిత కవిత్వం కలకాలం నిలుస్తుంది.

హృదయాలను రంజింపజేయాలి...

డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, సాహితీవేత్త, అవధాని

హృదయాలను రంజింపజేసేదే కవిత్వం. అది సామాజిక చైతన్యానికి దోహదపడాలి. కవిత్వంలో బావుకత ముఖ్యం. ప్రజల పక్షాన నిలిచి కవిత్వ సృజన చేస్తే అది చిరకాలం జీవిస్తుంది.





తెలుగు కవిత్వాన్ని కాపాడుకుందాం...

డాక్టర్ మలయశ్రీ, శతాధిక గ్రంథకర, చారిత్రక పరిశోధకుడు

తెలుగు భాషను, కవిత్వాన్ని కాపాడుకోవాలి. భాష లేకపోతే కవిత్వమే లేదు. మనమూ ఉండము. ఉన్నా లేనట్లే.

సాహిత్యంపై అభిమానం పెంచుకోవాలి

కొత్త అనిల్‌కుమార్, రచయిత, తెరసం అధ్యక్షుడు



యువత రోజుకు ఐదారు పేజీలైనా చదువుతూ సాహిత్యంపై అభిమానం పెంచుకోవాలి. ముట్టుకుంటే మట్టి నుంచి, తట్టి చూస్తే గుండె నుంచి, పలకరిస్తే పెదవి లోంచి కవిత్వం వస్తుంది.

ఆటో డ్రైవర్‌ను కవిగా చేసింది..: ఎండీ ఖాలిద్, కవి



ఆటో నడుపుకొని జీవించే నన్ను ఓ కవిగా నిలుపుతోంది కవిత్వమే. కవితలను చదవడం, కవి సమ్మేళనాలకు హాజరుకావడం వల్ల నాలో కవిత్వంపై ప్రేమ పెరిగింది. నా కవిత్వ అంశాలు సమాజ సమస్యలు.

పోక్సో కేసు నిందితుడి అరెస్ట్

● రిమాండ్‌కు తరలింపు

పెగడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమ పేరుతో వేధించి ఆమె మృతికి కారణమైన నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామభద్రునిపల్లి గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన బాస రాము, రంగదామునిపల్లి గ్రామానికిచెందిన బాలుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయగా ఈనెల15న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ 19నఆసుపత్రిలో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఇరువురిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు బాస రామును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

15 మంది బీఆర్‌ఎస్ నాయకులపై కేసు

చందుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన సంఘటనలో 15మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ అంజయ్య గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈనెల 16న మండల కేంద్రంలో అనుమతి లేకుండా రాస్తారోకో చేపట్టి సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన సంఘటనలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు, దప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మాందాల అబ్రహం, నాయకులు పెగ్గర్ల రమేష్‌రావు, ముద్రకోళ్ల వెంకటేశం, మాదాసు ప్రసాద్, పులి మనోహర్, ఎండి ఇస్మాయిల్, కొమ్ము రమేష్, పరశురాములతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా రాస్తారోకోలు, దిష్టిబొమ్మలు దహనం చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

23న బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈ నెల 23న కరీంనగర్ కేఎస్‌ఎల్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ఏర్పాట్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు వేలకు తగ్గకుండా కార్యకర్తలు, నాయకులు సమావేశానికి రావాలన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకల ఇన్‌చార్జి హరీష్‌రావు, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో పార్టీ ఆవిర్భావ సిల్వర్‌జూబ్లీ వేడుకలపై దిశానిర్దేశం చేస్తారని అన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతారని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, మాజీ కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, జంగిలి సాగర్, నాయకులు దిండిగాల మహేశ్, తులా బాలయ్య పాల్గొన్నారు.

ఫీడర్ కాలువల ధ్వంసంపై ఫిర్యాదు

శంకరపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ కాలువల ధ్వంసంపై నీటిపారుదల శాఖ ఈఈకి గురువారం ఫిర్యాదుచేసినట్లు యువజనసమితి రాష్ట్రకార్యదర్శి మోరెగణేష్ తెలిపారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మండలంలోని మొలంగూర్ గ్రామశివారులో దళితుల ప్రభుత్వసీలింగ్ భూము లను సాగునీరు అందించేఫీడర్ కాలువలను కొందరు రియల్టర్లు ధ్వంసం చేశారన్నారు. మరో కాలువను పూర్తిగా పూడ్చి వేసినట్లు పేర్కొన్నారు. కాలువలు లేకపోవడంతో రైతులకు నేడు సాగు నీరందకభూములు పడావుపడి రైతులు నానా కష్టాలు పడుతున్నారన్నారు. తక్షణమే ఈ విషయంపై క్షేత్రస్థాయిలో తనిఖీచేసి శాఖాపరమైన చర్యలు తీసుకొని కాలులను పునరుద్ధరణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

లోహియా సామాజిక న్యాయ పురస్కారానికి వకుళాభరణం ఎంపిక

హుజూరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు డాక్టర్ లోహియా సామాజిక న్యాయపురస్కారానికి ఎంపిక య్యారు. ఈనెల23న న్యూఢిల్లీలోని రాజా రాంమోహన్ రాయ్ మెమోరియల్ హాల్‌లో ఈపురస్కారాన్ని కృష్ణమోహన్‌రావు అందుకో నున్నారు. కృష్ణమోహన్‌రావు రెండుసార్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా బీసీ హక్కుల పరిరక్షణ కోసం, వెనుకబడిన వర్గాల అభ్యు న్నతికి కృషిచేసి నందుకుగాను ఈ పుర స్కారం అందజేయనున్నారు. ఈ పురస్కారం రావడంపై పట్టణంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మెదక్‌లో అనుపురం దొంగ స్వామి అరెస్ట్

● వేములవాడ మండలంలో కలకలం..

వేములవాడ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన దొంగ స్వామి అరెస్ట్ కావడం స్థానికంగా కలకల సృష్టించింది. మెదక్ ఎస్పీ డి ఉదయ్‌కుమార్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బుడగ జంగం బొమ్మెర బాపుస్వామి అలియాస్ శివస్వామి జ్యోతిష్యం చెబుతూ ఆరోగ్యం మెరుగు పేరిట పలు పూజలు చేస్తుండేవాడు. మెదక్ జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో తిరుగుతూ వేములవాడకు చెందిన జ్యోతిష్యం శివస్వామి పేరిట విజిటింగ్ కార్డు పంచుతూ సంచరిస్తున్నాడని, అతను నిమ్మకాయ, పసుపు, కుంకుమ వాసనలు చూపిస్తూ నీటిలో నిద్ర మాత్రలు కలిపి తాగించేవాడని, సదరు మహిళ స్పృహ కోల్పోయిన తర్వాత ఆమెపై అఘాయిత్యానికి పాల్పడి మొబైల్‌లో వీడియోలు తీసేవాడు. కొన్ని రోజుల తర్వాత మహిళలకు ఫోన్‌చేసి వీడియోలు ఉన్న విషయం చెప్పి బ్లాక్ మెయిల్ చేసేవాడు. మహిళల ఆర్థిక స్తోమతను బట్టి వేల నుంచి లక్షలు డిమాండ్ చేసి వసూల్ చేశాడు. ఇతర జిల్లాల్లో కూడా ఇదే విధంగా జ్యోతిష్యం పేరుతో వసూలు చేసిన చరిత్ర స్వామికి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బాపుస్వామి చేస్తున్న బ్లాక్ మెయిల్ వ్యవహారంపై బాధితుల నుంచి పోలీసులకు సమాచారం రావడంతో నిఘా పెట్టి నర్సాపూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ జరిపి అతడి మొబైల్ ఫోన్‌లో మహిళల వీడియోలు, బ్లాక్ మెయిల్‌చేసి వసూల్ చేసిన ఆన్‌లైన్ వివరాలను పోలీసులు గుర్తించారు. అతడి వద్ద మంత్రాలకు సంబంధించిన సామగ్రి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

వంట చెరుకు పేరుతో టేకు కలప తరలింపు

● రూ.20వేల జరిమానా విధించిన అటవీ అధికారులు

మల్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం ఓబులాపూర్ అటవీ ప్రాంతం నుంచి వంట చెరుకు మాటున టేకు కలపను ట్రాక్టర్‌లో తరలిస్తున్న వ్యక్తికి అటవీ అధికారులు బుధవారం రూ.20 వేల జరిమానా విధించారు. మూడు రోజుల క్రితం టేకు కలపను ట్రాక్టర్‌లో తరలించినట్లు కొందరు అటవీ అధికారులకు ఫిర్యాదు చేయగా సంబంధిత వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేసి కలపను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. టేకు కలప నరికివేతపై పలువురు జిల్లా అటవీ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లి స్థానిక అటవీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కలప తరలింపు విషయమై ఫారెస్ట్ సెక్షన్ అధికారి రత్నమ్మను వివరణ కోరగా కలప రవాణాపై వచ్చిన ఫిర్యాదు మేరకు తాము పట్టుకొని పరిశీలించామన్నారు. వంట చెరుకులో నాలుగు టేకు దుంగలు లభించడంతో జరిమాన విధించినట్లు ఆమె తెలిపారు.

మండుటెండల్లో మత్తడి దూకుతున్న చెక్‌డ్యాం

వీణవంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండు టెండల్లోనూ వీణవంక చెక్ డ్యాం మత్తడి దూకు తూ చూపరులకు కనువిందు చేస్తోంది. ఎక్కడ చూసినా మండుటెండలకు చేలన్నీ ఎండిపోతుండగా వీణవంక చెక్‌డ్యాం మత్తడి దూకుతూ ఆశ్చర్యం కలిగిస్తోంది. వాగులో పూర్తిస్థాయిలో నీరుపారడంతో పరిసర గ్రామాల్లో భూగర్భ జలా లు పెరిగాయి. ఈ వేసవిలో సాగు నీటి ఎద్దడి తీరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్డు పనులు అడ్డగింత


అధికారులతో మాట్లాడుతున్న చంద్రయ్య

శంకరపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాల్‌పూర్ గ్రామంలో సీసీరోడ్డు పనులను వడ్లకొండ చంద్రయ్య కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తమభూమి కొంతభాగం సీసీ రోడ్డు కిందపోతుందని అడ్డుకోవడంతో గురువారం తహసీల్దార్ భాస్కర్, ఎస్‌ఐ రవి, ఆర్‌ఐ ప్రత్యూష సంఘటన స్థలానికి చేరుకొని మాట్లాడారు. కాగా ఇటీవల పనులు అడ్డుకోవడంతో రెవెన్యూ అధికారులు సర్వేచేయగా ప్రభుత్వభూమి అదనంగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆగిపోయిన సీసీరోడ్డు పనులను చేపట్టేందుకు సిద్ధమవు తుండగా చంద్రయ్య కుటుంబం మళ్లీ అడ్డుకోవడంతో అధికారులు సంఘటన స్థలానికిచేరుకొని వారితో మాట్లాడారు. వారిని సముదాయించినా వినకపోవడంతో శుక్రవారం గ్రామసభ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి అనూషను తహసీల్దార్ భాస్కర్ ఆదేశించారు.

మోడల్ స్కూల్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

చిగురుమామిడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండ లంలోని ముల్కనూర్‌లో గురువారం పిచ్చుకల దినో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పోస్టర్‌మేకింగ్, వక్తృత్వపోటీలు నిర్వహిం చారు. సైన్స్ ఉపాధ్యాయుల మాట్లాడుతూ పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందన్నారు. ప్రకృతిలోని ప్రతిజీవియొుక్క ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఒకజీవి మరొకజీవిపై ఆధారపడి ఉంటుందని, ఆహార సమతుల్యత పాటించాలన్నారు. మూగజీవాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

గేట్‌లో కరీంనగర్ విద్యార్థి ప్రతిభ

● జాతీయ స్థాయిలో 60వ ర్యాంకు సాధించిన హర్షిత్‌రెడ్డి



కరీంనగర్ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్-2025లో కరీంనగర్‌కు చెందిన శీలం హర్షిత్‌రెడ్డి ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 60వ ర్యాంకు సాధించాడు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన హర్షిత్‌రెడ్డి తండ్రి మధుకర్‌రెడ్డి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కరీంనగర్‌లోని మెహర్‌నగర్‌లో నివాస ముంటున్నారు. హర్షిత్‌రెడ్డి తల్లి మంగశ్రీ గృహిణి. చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తున్న హర్షిత్‌రెడ్డి కరీంనగర్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ (సీఎస్‌సీ) ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత యేడాది గేట్‌లో జాతీయస్థాయిలో 776వ ర్యాంకు సాధించాడు. మరింత మెరుగైన ర్యాంకు సాధించాలనే పట్టుదలతో చది విన హర్షిత్‌రెడ్డి బుధవారం ప్రకటించిన గేట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. దేశంలో ప్రముఖ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డిని తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనతో

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

గోదావరిఖని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన సీపీఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయనముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో జమిలి ఎన్నికలు తీసుకురావడం ద్వారా సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగించే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. జమిలి ఎన్నికల విధానాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గి ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. ఇదే జరిగితే కేంద్ర ప్రభుత్వంపై ఉత్తరాది రాష్ట్రాల ఆజమాయిషీ పెరిగి దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఏడు లక్షల కోట్లు అప్పు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేయడం శుభసూచకమన్నారు. దేశంలో నక్సలిజాన్ని, కమ్యూనిస్టులను రూపుమాపడానికి మోదీ, అమిత్‌షా అవలంబిస్తున్న నిరంకుశ విధానం సరైంది కాదని చాడ విమర్శించారు. ప్రస్తుతం విజ్ఞానాన్ని మంచివైపు ఉపయోగించకుండా దేశంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తున్న అభ్యుదయవాదులను, కమ్యూనిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడాన్ని హర్షిస్తున్నామని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయించి, వారికి బడ్జెట్ కేటాయింపులు జరుగకపోవడం వల్ల ఒరిగేదేమీ ఉండదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కలవేన శంకర్, తాండ్ర సదానందం, కనకరాజు, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, తాళ్లపల్లి మల్లయ్య, ఓదమ్మ, స్వామి, శంకర్, రమ, రాజరత్నం, మార్కపురి సూర్య, కుమార్, రేణికుంట్ల ప్రీతం పాల్గొన్నారు.

ప్రపంచ సుందరికి అగ్గిపెట్టెలో అమిరే చీర



ప్రపంచ సుందరి క్రిస్టినాకు అగ్గిపెట్టెలో అమిరే చీరను అందజేస్తున్న హరిప్రసాద్

సిరిసిల్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో మేలో జరిగే 2025 ప్రపంచ సుందరి పోటీలకు వచ్చిన 2024 ప్రపంచ సుందరి క్రిస్టినాను సిరిసిల్ల నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో మిస్ వరల్డ్‌ను సన్మానించడంతో పాటు తాను తయారు చేసిన అగ్గిపెట్టెలో అమిరే చీర ను ఆమెకు అందజేశారు. ఈ సందర్భం గా క్రిస్టినా హరిప్రసాద్ తయారు చేసిన చీరను చూసి ఆశ్చర్యపోయి అభినందించారు. అగ్గిపెట్టెలో అమిరే చీరను తన భుజాలపై వేసుకొని ఫొటోలకు ఫోజులు ఇచ్చారు.



అడవులతోనే మనుగడ

○ అంతరించి పోతున్న వన సంపద
○ ఆహారం, నీటి కోసం జనారణ్యంలోకి వన్యప్రాణులు
○ కరీంనగర్ జిల్లాలో 427 హెక్టార్ల అటవీ ప్రాంతం
○ నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

కరీంనగర్ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రాణుల మనుగడకు దోహదపడే అడవులు జీవ వైవిధ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. పక్షులు, జంతువులు, వివిధ రకాల కీటకాలకు ఆవాసాలుగా మారిన అడవులు అంతరించిపోతే అనర్థాలు జరిగే అవకాశాలున్నాయి. అందుకే ప్రాణకోటికి ఆవాసాలుగా ఉన్న అడవుల రక్షణ అత్యంత అవసరం. అడవుల సమతుల్యత లోపిస్తే వాటిపై ఆధారపడి జీవించే ప్రాణులపై ప్రభావం పడుతుంది. భూమిపై అడవులే లేకపోతే... సకల జీవరాశి లేదు. ప్రాజెక్టుల నిర్మా ణం, రోడ్లు, ఇళ్ల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికి అంత రించిపోతున్నాయి. మానవ మనుగడకు అవసరమైన అడవులను కాపా డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆహార భద్రత, పోషణ, జీవనోపాధిలో అడవులు కీతక పాత్రను పోషిస్తున్నాయి. ఆహారం, ఇంధనం, ఉపాధిని అందించడంతో పాటు అడవులు నేల సారాన్ని పెంచుతాయి. నీటి వనరులను కాపాడుతాయి. కీలకమైన పరాగసంపర్కాలతో సహా జీవ వైవిధ్యానికి అడవులు ఆలవాలంగా నిలుస్తాయి. అడవులు కార్బన్‌ను నిలువచేయడం ద్వారా వాతావరణ మార్పుల సమస్థితికి దోహదం చేస్తాయి.


● అంతంతమాత్రంగా సంరక్షణ చర్యలు

ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో కరీంనగర్‌లోనే తూర్పు, పశ్చిమ అటవీ డివిజన్‌లు విభజించి రెండు డివిజన్లకు వేర్వేరుగా అటవీశాఖ అధికారులు (డీఎఫ్‌వో) ఉండేవారు. జిల్లాల విభజనతో నాలుగు జిల్లాల్లో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాకు కలిపి ఒకే డీఎఫ్‌వో ఉండగా పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు వేర్వేరు డీఎఫ్‌వోలను నియమించారు. కరీంనగర్ జిల్లాలో అటవీ ప్రాంతం సైదాపూర్, గంగాధర మండలాల్లో మాత్రమే ఉంది. చొప్పదండి మండలంలో కొంత అటవీ ప్రాంతాన్ని పెంచుతున్నారు. జిల్లాలో చాలా తక్కువ విస్తీర్ణంలో అడవులున్నాయి. అటవీ ప్రాంతంలో కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమం అంతంత మాత్రంగానే నిర్వహిస్తుండడం, ఇష్టానుసారంగా చెట్లను నరికి వేస్తుండటంతో పర్యావరణ సమస్య తలెత్తుతున్నది. వన్యప్రాణుల వేట ఇష్టానుసారంగా కొనసాగుతుండటంతో అరుదైన కొన్ని జంతువులు, పక్షుల జాతి అంతరించే ప్రమాదం పొంచి ఉన్నది.

● హుజూరాబాద్ ఫారెస్ట్ డివిజన్‌లో 173.247 హెక్టార్లు ఫారెస్టు ఉండగా రాయికల్ ప్రాంతంలోనే ఈ అటవీ ప్రాంతం ఉంది. జిల్లా భూమి విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 33 శాతం ఉండాలి. కానీ జిల్లాలో 10 శాతంలోపే అటవీ ప్రాంతం ఉంది. రోడ్ల పక్కన, ఇళ్లల్లో, సీటీసీ మియావాకి, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెట్లతో కలిపి ఓవరాల్‌గా జిల్లాలో గ్రీన్‌కవర్ మాత్రం 15 శాతం వరకు ఉంది.

అటవీ దినోత్సవ నేపథ్యం

అడవుల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2012లో మార్చి 21న అటవీ దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానం చేసింది. 2013 మార్చి 21న మొదటి అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. అటవీ దినోత్సవం సందర్భంగా అడవులు, చెట్ల ప్రాధాన్యం, మానవ మనుగడలో అడవుల పాత్రపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తారు. అడువులను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తారు.



● జనావాసాల్లోకి వన్యప్రాణులు

అటవీ ప్రాంత విస్తీర్ణం తగ్గిపోవడంతో అటవీ జంతువులకు సహజసిద్ధంగా లభించే ఆహారం దొరకకుండా పోతున్నది. ఇంకో వైపు అడవి పందులు, కుందేళ్లు, ఉడుములు, నెమళ్ల వంటి వణ్యప్రాణుల వేట కొనసాగుతున్నది. దీనికి తోడు మండే ఎండలతో అటవీ ప్రాంతంలో నివసించే వన్యప్రాణులకు తాగునీరు లభించని పరిస్థితి నెలకొన్నది. తాగునీరు, ఆహారం వెదుక్కుంటూ ఎలుగుబంట్లు, జింకలు, నెమళ్లు, కోతులు, దుప్పి, మనుబోతు, హైనా, ఇతర జంతువులు అభయారణ్యం వదిలి జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే కొన్ని జంతువులు వేటగాళ్ల బారినపడుతుండగా మరి కొన్ని జంతువులు ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి.



అడవుల రక్షణకు చర్యలు

కరీంనగర్ జిల్లాలో 429.772 హెక్టార్ల పరిధిలో అటవీ విస్తీర్ణం ఉంది. ఇందులో కరీంనగర్ ఫారెస్టు డివిజన్‌లో 256.525 హెక్టార్లు అటవీ ప్రాంతం ఉండగా ఇందులో గంగాధర మండలం వెంకటాయపల్లి, కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వాగు ప్రాంతంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అటవీశాఖ భూమి కోల్పోగా దానికి బదులుగా చొప్పదండి మండలం వెదురుగట్టు గ్రామంలోని బోడిగుట్ట ప్రాంతం 400 హెక్టార్లను కొంత కాలం కిందట అటవీ శాఖకు అప్పగించారు. ఈ బోడిగుట్ట ప్రాంతంలో పెద్ద ఎత్తున మొక్కలను అటవీ శాఖ పెంచుతున్నది. కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో అటవీశాఖకు ఇచ్చిన 17.34 హెక్టార్ల భూమిలో ఇరుకుల్ల వాగు 14 హెక్టార్ల వరకు ఉంది. అయినప్పటికీ ఈ ప్రాంతాన్ని అడవిగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ సిద్ధమవుతుండగా సరిహద్దు నిర్ణయించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇంత వరకు హద్దులను ఏర్పాటు చేయనందున ఇక్కడ మొక్కలు పెంచేందుకు వీలులేకుండా పోతున్నది.

1952 వైల్డ్ లైఫ్ యాక్ట్(ప్రొటెక్షన్) కింద కేసులు :

కరీంనగర్ జిల్లాలో గడిచిన ఏడాదిలో వైల్డ్‌లైఫ్ యాక్ట్ కింద ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో నిందితులకు జరిమానా విధించారు.

● ఏడాదిలో కరీంనగర్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి విలువైన టేకు, ఇతర కలపను అక్రమంగా తరలిస్తున్న, అనుమతి లేకుండా చెట్లను నరకివేయటంలపై 100 వరకు కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి దాదాపు 40 లక్షల రూపాయల జరిమానా వసూలు చేశారు.

కరీంనగర్, జగిత్యాలలో ఐటీ సోదాలు

● వారధి సొసైటీ, ఆర్డీవో కార్యాలయంలో రికార్డుల తనిఖీలు
● టీడీఎస్ కటింగ్‌లో అవకతవకలపై రికార్డుల పరిశీలన

కరీంనగర్ క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడిజిల్లాలో గురువారం హైదరాబాద్‌కు చెందిన ఆదాయపు పన్నుశాఖ అధికారులతో కూడిన నాలుగు బృందాలు రెండుచోట్ల సోదాలు నిర్వహించాయి. కరీంనగర్‌లోని పద్మనగర్‌లో ఉన్న వారధి సొసైటీలో, జగిత్యాల ఆర్‌డీఓ కార్యాలయంలో ఐటీ అధికారుల బృందాలు సోదాలు నిర్వహించాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాల కోసం ఔట్‌సోర్సింగ్ ద్వారా ఎంపిక, వేతనాల చెల్లింపు వారధి సొసైటీ ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ లావాదేవీలలో టీడీఎస్ కటింగ్‌లో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లుగా ఆదాయపన్నుశాఖ హైదరాబాద్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అలాగే జగిత్యాలలో రైల్వేప్రాజెక్టు కోసం భూసేకరణలో ఆర్‌డీఓ కార్యాలయం ద్వారా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపుల లావాదేవీలలో టీడీఎస్ కటింగ్‌లలో భారీ మొత్తంలో అవకతవకలు జరిగినట్లు ఐటీశాఖకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారుల బృందాలు రెండు చోట్ల తనిఖీలు నిర్వహించాయి. రికార్డులను తనిఖీ చేసి టీడీఎస్ కటింగ్‌లో జరిగిన అవకతవకలను గుర్తించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన కొన్ని రికార్డులను కూడా ఐటీ అధికారులు స్వాధీ నం చేసుకున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా కరీంనగర్ ఐటీ అధికారులకు తెలియకుండా హైదరాబాద్ నుంచి నాలుగు బృందాలు వచ్చి కరీంనగర్, జగిత్యాలలోని రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించటం గమనార్హం.

● ఆర్డీవో కార్యాలయంలో పలువురి విచారణ

జగిత్యాల అర్బన్: జగిత్యాల జిల్లాలో 2019 రైల్వే భూసేకరణలో ప్రభుత్వం చెల్లించిన సొమ్ముకు సంబంధించి పలు అక్రమాలపై జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో ఐటీ అధికారులు గురువారం రాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. లింగంపేట నించి అంతర్గాం, అంబారిపేట నుంచి ముందుకు విస్తరించిన రైల్వే ట్రాక్ నిర్మాణంలో నష్ట పరిహారం విషయంలో కోట్లాది రూపాయల గోల్‌మాల్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు జగిత్యాల ఆర్డీఓ కార్యాలయంలో అప్పుడు ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్‌ను పిలిచి గురువారం రాత్రి పొద్దు పోయేవరకు విచారించారు. అక్రమాలకు పాల్పడిన కొందరు రైతులను, అందుకు ఉపయోగించిన పాన్ కార్డుల వివరాలను అధికారులు పరిశీలించారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం

● విడతల వారీగా విద్యుత్ వినియోగానికి రైతుల నిర్ణయం



గొర్రెగుండంలో తాళం వేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మల్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోవోల్టేజీతో పంటలకు సాగు నీరందడం లేదని, పంటలను కాపాడుకోవడానికి పంప్‌సెట్లకు విడతల వారీగా విద్యుత్ సరఫరా అయ్యేలా రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసుకుంటున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం గొర్రె గుండం గ్రామంలో వ్యవసాయ వినియోగం కోసం 100 కేవీల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 90హెచ్‌పీల సామర్థ్యం వరకు పంప్‌సెట్లు వినియోగిస్తున్నారు. కొన్ని అనధికార కనెక్షన్లతో నెల రోజులుగా లోవోల్టేజీతో పంప్‌సెట్లు కాలిపోతున్నాయి. చివరి దశలో ఉన్న వరి పంటలకు, మామిడి ఇతరత్రా పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం రైతులు పలు మార్లు అధికారు లు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులే ఓ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ ఫీడర్‌కు 22 రోజులుగా తాళం వేసి రాత్రి సమయంలో కొన్నింటికి, పగటి పూట మరికొన్ని మోటార్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తున్నారు. ఇంతుకు ఒక వ్యక్తిని నియమించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తగ్గింది.

●మల్యాల ట్రాన్స్‌కో ఏడీఈ మహేందర్‌ను వివరణ కోరగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు 30 వరకు పంప్‌సెట్ కనెక్షన్లు ఉండగా మరో 12 వరకు అనధికార మోటార్లను వినియోగిస్తున్నారన్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పడి లోవోల్టేజీ సమస్య ఏర్పడుతుందన్నారు. ఇటీవల రైతులు కనెక్షన్ల కోసం డీడీలు చెల్లించడంతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మాజీమేయర్ సునీల్‌రావు కుమారుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టిన మాజీమేయర్ కుమారుడిపై కేసున మోదైంది. మాజీమేయర్ సునీల్‌రావు కుమారుడు వై ప్రద్యుమ్ హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నివాసముంటూ చదువుకుంటున్నాడు. ఈ నెల19న స్నేహితులు ఎస్ యశ్వంత్‌రెడ్డి, కార్తీక్‌రాజ్‌తో కలిసి మాదాపూర్‌కు కారులో వచ్చాడు. అక్కడ మద్యం తాగి కారులో బయలుదేరారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 10కి వచ్చేసరికి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.బెలూన్‌లు తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని శ్వాసపరీక్ష చేయగా ప్రద్యుమ్‌కు బ్లడ్ అల్కహాల్ కౌంట్(బీఏసీ) 38 వచ్చింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని బుగ్గరాజేశ్వరతండా శివారులో పట్టుకున్నామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. వాహనతనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఎదురుపడిందని, తనిఖీచేయగా రవాణాకు అనుమతి పత్రాలు లేకపోవడం వల్ల వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని అజ్మీరా మోహన్‌పై కేసు నమోదు చేశామన్నారు.

చెక్‌బౌన్స్ కేసుపై కర్ణాటక పోలీసుల విచారణ

కరీంనగర్‌క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు చెందిన ఓవ్యక్తికి ఇచ్చిన చెక్కు‌బౌన్స్ కేసులో నిందితుడిగా ఉన్న ఎంఐఎం కరీంనగర్ శాఖ అధ్యక్షుడు గులాం అహ్మద్‌కు నాన్‌బెయిలబుల్ వారంట్ (ఎన్‌బీడబ్ల్యు)జారీ చేసేందుకు కర్ణాటక పోలీసులు గురువారం కరీంనగర్‌కు వచ్చారు. గులాం అహ్మద్ ఇంటికిచేరుకున్న కర్ణాటక పోలీసులు గంటపాటు కుటుంబసభ్యులతో మాట్లాడినట్లు సమాచారం. ఫిర్యాదు దారుడిని వెంట బెట్టుకుని వచ్చిన పోలీసులు ఎన్‌బీడబ్ల్యు జారీచేసేందుకు ప్రయత్నించగా గులాం అహ్మద్ ఇంటిలో లేరనితెలిసింది. దీనిపై స్థానిక పోలీసులను అడగగా చెక్‌బౌన్స్ కేసులో కర్ణాటకపోలీసులు గులాంఅహ్మద్ ఇంటికి వచ్చినట్లు తెలిపారు.

ముగిసిన శివ కల్యాణోత్సవం





నాకబలి పూజలో పాల్గొన్న భక్తులు, అద్దాల మండపంలో నాకబలి నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన శివకల్యాణోత్సవం గురువారం ముగిసింది. ఆలయ అర్చకులు ఉదయం 6.30 గంటలకు తీర్థరాజ స్వామి పూజ, ఔపాసనం-బలిహరణం ఘనంగా నిర్వహించారు.

శేషహోమాలు జయాదులు, పూర్ణాహుతి, యాగ మండప దేవతోత్వాసనాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జంగమ పూజారులు శరభ గజ్జల కార్యక్రమాన్ని, పల్లకీ సేవను నిర్వహించారు. ఉదయం అద్దాల మండపంలో నాకబలి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గుమ్మడికాయలను కత్తితో కొట్టారు. అనంతరం త్రిశూల యాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు త్రిశూలానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి స్వామివారి ధర్మగుండంలో చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా, హోమం కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

కరీంనగర్ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. కరీంనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ మామిడాల సురేందర్‌ను చొప్పదండికి, స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ బి వంశీకృష్ణను గంగాధరకు, గంగాధర ఎస్‌ఐ జి నరేందర్‌రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రాజును రామడుగుకు, రామడుగు ఎస్‌ఐ శేఖర్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు సీపీ గౌస్ ఆలం ఉత్తర్వులు జారీ చేశారు.

కళాకారుల బృందానికి అభినందన

గణేష్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కళాకారులను ఎస్ఈ మేక రమేష్ బాబు గురువారం అభినందించారు. విద్యుత్ శాఖ కల్చరల్ పోటీల్లో కరీంనగర్ కళాకారులు ప్రదర్శించిన స్వప్నం రాల్చిన అమృతం నాటికకు ఉత్తమ బహుమతి వచ్చింది. సాంస్కృతిక విభాగంలో కె ఆనంద్, జానపద గేయాల విభాగంలో మధుకర్, ఫ్యాన్సీ డ్రెస్ విభాగంలో సరళకుమారి, మ్యాజిక్‌లో వేణుగోపాల్ మొదటి బహుమతి సాధించారు. కార్యక్రమంలో రంగు వెంకటనారాయణ, ఆనంద్, సరళకుమారి, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్, డివిజనల్ ఇంజనీర్ రాజారమణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా యోగ నారసింహుడి ఏకాంతోత్సవం



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు



స్వామివారికి ప్రత్యేక పూజలు

ధర్మపురి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి (యోగ) ఏకాంతోత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషప్ప కళావేదికపై ధర్మపురికి చెందిన ఎస్ శివాని బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. మద్వాచారి పవన్‌కుమార్ బృందం పేరిణి శివతాండవం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి 7 గంటలకు ఉగ్ర నారసింహ (కొత్త) స్వామి పుష్పయాగం, రాత్రి 9 గంటలకు వేంకటేశ్వర స్వామి ఏకాంతోత్సవం ఉంటుంది. శేషప్ప కళావేదికపై సాయంత్రం 6-30 నుంచి 7-30 వరకు గోదావరిఖనికి చెందిన డాక్టర్ జ్యోతిరంగ బృందం కూడిపూడి నృత్య ప్రదర్శనలు, 7-30నుంచి రాత్రి 9 వరకు కరీంనగర్‌కు చెందిన సుహాసిని బృందం వారిచే నృత్య ప్రదర్శనలు ఉంటాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. హుండీ లెక్కింపు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతిపాదనలకే పరిమితం

5వ పేజీ తరువాయి

పనులు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

● ప్రాణహిత చేవెళ్లకు రూ.32 కోట్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు 32 కోట్ల రూపాయల నిధులను కేటాయించింది. బీఆర్ఎస్ ప్రభు త్వం అధికారంలోకి రాగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి నీరు తరలించి అక్కడి నుంచి పంపుల ద్వారా చేవెళ్ల వరకు సాగునీటిని అం దించాలని ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అయితే కేసీఆర్ గోదావరి నదిపై రివర్స్ ఎత్తిపోతల ద్వారా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీలు నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లిలోకి నీటిని ఎత్తిపోశారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగడంతోపాటు అన్నారం బ్యారేజీకి బుంగ పడింది. సుందిళ్ల బ్యారేజీకి మరమ్మతులు వచ్చాయి. దీంతో ప్రభుత్వం మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం లేదు. ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మాణం చేపట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించి శ్రీపాద ఎల్లంపల్లి ద్వారా సాగు నీటిని ఎత్తిపోస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇది వరకే చెప్పారు. ఏప్రిల్ నెలలో బ్యారేజీ పనులు చేపడతామని ఇటీవల మంత్రి ప్రకటించారు. ఆ మేరకు 32 కోట్ల రూపాయల నిధులను బడ్జెట్‌లో కేటాయించడంతో పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు కనబడుతున్నాయి. కాళే శ్వరం ప్రాజెక్టుకు సైతం 2,685 కోట్లు కేటాయించారు. వివిధ ప్యాకేజీల్లో మిగిలిన పనులకు ఈ నిధులను వెచ్చించనున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సుద్దాల గ్రామంలోని ఉపాధిహామీ కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ లేబర్ కార్డు, సుకన్య సమృద్ధి యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్, జీవనజ్యోతి యోజన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పోషణ అభియాన్ స్కీం, మహిళ చట్టాలపై వివరించారు. మహిళ సాధికారత దిశగా ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన టోల్‌ఫ్రీ నంబర్ల గురుంచి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ కె. కృష్ణవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ పి. స్వరూప, సీనియర్ మేట్ నరేష్ గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



కుక్కలగూడూర్‌లో మాట్లాడుతున్న డీసీపీ పుల్ల కరుణాకర్

పాలకుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని డీసీపీ పుల్ల కరుణాకర్ అన్నారు. గురువారం కుక్కలగూడూర్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించవచ్చన్నారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో కమిటీలు వేసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. మహిళలు, బాలికలకు ఇబ్బందులు తలెత్తితే డయల్ 100, షీటీమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్ఐ ఆర్ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంల ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ కె ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్‌దిబెస్ట్ చెప్పి...అంతలోనే హఠాన్మరణం

గుండెపోటుతో ప్రైవేట్ ఉపాధ్యాయుడి మృతి



సత్యం(ఫైల్)

కోల్‌సిటీటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బాలసాని సత్యం గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శుక్రవారం పది పరీక్షలు ఉండటంతో విద్యార్థులకు వీడ్కోలు చెప్పేందుకుగురువారం ఉదయం పాఠశాలకు వచ్చాడు. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పి ఫొటోలు దిగారు. అంతలోనే అస్వస్థతకు గురైన సత్యంను తోటి ఉపాధ్యాయులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి కరీంనగర్ తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రాంనగర్‌కు చెందిన సత్యం పాతికేళ్ళుగా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డిజిటల్ విద్యావిధానంపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇప్పలపల్లిలోని క్రిసెంట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు గురువారం డిజిటల్ విద్యావిధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల సీఈఓ సయ్యద్ తహబిలాల్, మాట్లాడుతూ విద్యావిధానంలో మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా విద్యార్థులలో నైపుణ్యం పెంచేవిధంగా విద్యను అందిస్తున్నామన్నారు. నర్సరీనుండి 5వ తరగతి వరకు వచ్చే విద్యా సంవత్సరం నుండి డిజిటల్ విద్యావిధానం ప్రవేశపెడుతున్నామన్నారు. కరస్పాండెంట్ ఎస్‌వి అయాజ్, సీఈఓ తాహబిలాల్, జమీరుద్దీన్, ప్రిన్సిపాల్ నసీర్, వైస్ ప్రిన్సిపాల్ జాఫర్, జనరల్ ఇంచార్జి ఫర్జానా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎలిగేడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో అనసూరి నరేంద్రచారి తెలిపారు. గురువారం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఎంఈవో మాట్లాడుతూ ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట ఉన్నత పాఠశాలలకు చెందిన 69మంది విద్యార్థులలో 31మంది బాలికలు, 38మంది బాలురు ఎలిగేడులో పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. మాస్ కాపియింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరా ఏర్పాటు చేశామన్నారు. మూడు గదులను కేటాయించామని, విద్యార్థులు ఉదయం 9గంటలలోపు పరీక్ష కేంద్రానికి రావాలని పేర్కొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఎంఈవో రాజయ్య పరిశీలించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు మొత్తం 873 మంది పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఛీఫ్ సూపరింటెండెంట్ రత్నాకర్ రెడ్డి, రాధాస్వామి ,పి శ్రీనివాస్ రెడ్డి , రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని డాక్టర్ ఆరే సతీష్ అన్నారు. గట్టెపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, స్టోర్ట్ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రధానో పాధ్యాయులు అన్నపూర్ణ, ఉపాధ్యాయ బృందం రవికు మార్, రవీందర్రావు, సమ్మిరెడ్డి, ప్రణయ్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో సిరిమల్ల మహేష్ తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కూనారం జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 271విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్ తీసుకురావాలని ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదని తెలిపారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పరచుకొని చదవాలని తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ అన్నారు. టీటీఎస్ అంతర్గాం, పొట్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లతోపాటు ఎల్లంపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అబ్దుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేసి తహసీల్దార్ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని సూచించారు. ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీకి ముందుకు వచ్చిన అబ్దుల్ కలాం ట్రస్ట్ ప్రతినిధులను తహసీల్దార్ అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, కల్పన, అబ్దుల్ కలాం ట్రస్ట్ ప్రతినిధి ప్రణీత్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6న రక్తదాన శిబిరం

మంథని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజపేయి శతజయంతి సందర్భంగా ఏప్రిల్ 6న మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో మంథనిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసే శిబిరానికి యువత హాజరై రక్తదానం చేయాలని కోరారు. శిబిరానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరవుతున్నట్లు తెలిపారు. రక్తదానం చేయటానికి ఆసక్తి ఉన్న యువత ఈనెల 31 లోపు సెల్ నెం. 9347590795, 7032469634 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. బీజేపీ నేతలు సబ్బని సంతోష్‌కుమార్, బోగోజు శ్రీనివాస్, నారమల్ల కృష్ణ, వేల్పుల సత్యంలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజాభివృద్ధి

మంథని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభ్యున్నతితోనే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆర్‌పి ప్రాజెక్టు ఆఫీసర్ అనూష, ఫీల్డు కో-ఆర్డినేటర్ శేఖర్‌లు అన్నారు. ఎంపీడీవో ఆఫీసులో మండల స్థాయి ఎస్‌హెచ్‌జీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా ఆదాయాన్ని పెంచే కార్యకలాపాలపై మహిళలు అవగాహన కల్గి ఉండాలన్నారు. దీర్ఘకాలిక వ్యాపార అభివృద్ధి కోసం వ్యాపార నైపుణ్యాలు, లింగ సమానత్వం గురించి సమావేశంలో సమీక్షించారు. ఏపీఎం పద్మ, మహిళలు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

రామగిరి మార్చి 20(ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా రేండ్ల కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన సమావేశంలో కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రేండ్లకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా రేండ్ల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా జాపతి శేఖర్, కోశాధికారిగా రేండ్లశ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

త్వరలో మానేరుపై బ్రిడ్జి పనులు ప్రారంభం

ఓదెల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాలకు అనుకూలంగా ఉన్న రూపునారాయణపేట మానేరువాగుపై త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం రూతిసంస్థ ఎండీ మదుసూధన్‌రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే మానేరు వాగు ప్రాంతంలో సర్వే నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల ప్రారంభంలో ఇప్పటికే జాప్యం అయిందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. వేసవిలో పిల్లర్ల నిర్మాణం ఫూటింగ్ పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే సర్వే అధికారులు మానేరు అడ్డుకొలత, లోతుపై సర్వే నిర్వహించారు. అనంతరం మ్యాప్‌ల ద్వారా ముందుగా నిర్వహించే పనులను పరిశీలించారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంకం రమేష్, బోంగోని శ్రీనివాస్ గౌడ్, రెడ్డి రజనీకాంత్, మాజీ ఎంపీటీసీ నీర్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పడాల రాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.



మానేరువాగు వద్ద పటాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ వార్డులో టీడీఎఫ్ఐడీఈ నిధులు 35 లక్షల అరవై వేల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో వార్డు ప్రజలు, స్కూల్ పిల్లలు ఇబ్బందులు పడేవారన్నారు. చందపల్లి నుంచి తుర్కల మద్దికుంట వరకు ఇటీవలే బిటి రోడ్ పూర్తి చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి విన య్, మాజీ కౌన్సిలర్లు, ప్రజలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల ఆమోదంపై సంబరాలు

పాలకుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ 42శాతం బిల్లు ఆమోదంపై గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉపాధిహామీ కూలీలకు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌మక్కాన్‌సింగ్‌ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద గురువారం ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన నేపథ్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి మాదిగ ఐక్య వేదిక నాయకులు క్షీరాభిషేకం చేశారు. మాదిగ ఐక్య వేదిక నాయకులు గంగాప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా పోరాటం చేసిన మంద కృష్ణ సేవలను కొనియాడారు. వర్గీకరణ బిల్లు ఆమోదం కోసం సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతి పక్ష పార్టీల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. వడ్డేపల్లి సురేష్, అల్లి గణేష్, రాజేందర్, మనుమండ్ల రమేష్, ఆరుముల్ల సదానందం, కల్వల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌శ్రేణులు

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వ హించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, బాసంపల్లి శ్రీనివాస్, వినోద్, రాయపాక మనోహర్, జల్లి రమేష్, అంజయ్య, రాచర్ల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహాలను పునర్నిర్మించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంథని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక లైన్‌గడ్డ వద్ద ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న అష్ట లింగాల్లో భాగమైన శివలింగం, అమ్మవారి విగ్రహాలను పునర్ని ర్మించాలని బీజేపీ నేతలు సబ్బని సంతోష్ డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీనారా యణ స్వామి దేవస్థాన భూములను సంద ర్శించారు. సర్వే నెం. 1005లో 2.1 ఎకరాల భూమి, సర్వే నెం. 8 గుంటల భూమిని కబ్జాకు గురికాకుండా హద్దులను నిర్మించాల న్నారు. ధ్వంసమైన విగ్రహాలను తిరిగి నెలకొ ల్పాలని, వాటి చుటూ కాంపౌండ్ వాల్‌నిర్మిం చాలన్నారు. సతీష్‌కుమార్, సాగర్, అశోక్, శ్రావణ్, రాజయ్య, మురళీకృష్ణలు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

మంథని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి ఆలయంలో హుండీ లెక్కించగా రూ.1 లక్ష 3 వందల 20లక్షల ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ మేనేజర్ రాజ్‌కుమార్ తెలిపారు. పూజారి మారుపాక ప్రశాంత్, భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం వివిధ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత, మహిళలపై నేరాలు, డయల్ 100 గురించి వివరించారు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, కే రవీందర్‌లు మాట్లాడారు. సైబర్ నేరాలు ఇప్పుడు సమాజంలో సమస్యగా మారాయని, తప్పుడు లింకులను ప్రజలు తెరువరాదన్నారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు పంపడం చేయవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని, బ్యాంకు రుణాలు, లక్కీ డ్రాలు, బంపర్ ఆఫర్లు, జాబ్ ఆఫర్లు, ప్రైవేట్ రుణాల వలలో పడవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఎవరైనా మహిళలు, ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు డయల్ 100ద్వారా సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరాలు జరిగితే 1930కు తెలియజేయాలన్నారు.

నంబర్ ప్లేట్ లేని 483వాహనాలకు చలాన్లు...

గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేని 483వాహనాలను పట్టుకుని చలాన్లు విధించడమే కాకుండా నెంబర్ ప్లేట్లు బిగించినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. నెంబర్ ప్లేట్ బిగించిన తరువాతే వాహనాలను స్టేషన్ నుంచి బయటకు పంపుతున్నారు. వాహనదారులు తమ నెంబర్ ప్లేట్లు తప్పుగా ఉంటే వెంటనే సరి చేసుకోవాలన్నారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌సర్టిఫికెట్ తప్పనిగా ఉండాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐలు భూమేష్, రమేష్, సోనియా, మధుకర్ పాల్గొన్నారు.

23న సామూహిక భగవద్గీత పారాయణం

మంథని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సనాతన ధర్మ ప్రచార సమితి, శ్రీసీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో మంథనిలోని శివకిరణ్ గార్డెన్స్‌లో ఈనెల 23న ఆదివారం 5 వేల మందితో గీతా పారాయణం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. సనాతన ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంథెన శ్రీనివాస్, వొడ్నాల శ్రీనివాస్ బృందం గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. రెండేళ్ళుగా మంథనిలో నిరంతరాయంగా 665 ఇండ్లలో గీతా పారాయణాన్ని నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఈనెల 23న జరిగే కార్యక్రమంలో 5 వేల మంది భక్తులతో పారాయణాన్ని నిర్వహిస్తామన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుగా సాధించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అతిథులుగా అచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్ విజయరాజం, స్వామీజీలు హాజరవుతున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి ఆలయం నుంచి శోభయాత్ర ప్రారంభిస్తామన్నారు. కొత్త శ్రీనివాస్‌గుప్తా, మేడగోని రాజమౌళిగౌడ్, పుప్పాల విక్రమ సింహారావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంతో యువతకు ఉపాధి



స్వీట్లు పంచుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌యువ వికాసంతో యువతకు సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధి కల్పిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.శివరామకృష్ణ అన్నారు. గురువారం కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచి బాణాసంచా కాల్చారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువజన వికాస పథకం ప్రారంభించి 5లక్షల మందికి 6వేల కోట్ల రాయితీ రుణాలు మంజూరు చేయనున్నారని తెలిపారు. రానవేన క్రాంతి, తాండ్ర గోవర్ధన్, కొంతం మధు, ఎనగంటి నవీన్, బందెల శ్రీనివాస్, సాయికుమార్, పాల్గొన్నారు.

యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇరికి మహేష్ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారికి రూ. 4లక్షల వరకు ఆయా కార్పొరేషన్‌ల ద్వారా ఆర్థిక సాయం ఇస్తారని తెలిపారు. ఏప్రిల్ 6 నుంచి 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జూన్ 2న జాబితాను ప్రకటిస్తుందని పేర్కొన్నారు.

వికసిత్ భారత్‌కు 13మంది ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌కు ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీ నుండి 13మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీతారెడ్డి వెల్లడించారు. విద్యార్థులను ఫౌండర్ చైర్మన్ ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ దాసరి మనోహర్‌రెడ్డి ప్రశంసించారు.. నోడల్ స్థాయి జిల్లా పోటీలు ఈనెల 21, 22వ తేదీలలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ గోదావరిఖనిలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పెవింగ్ దివే ఫర్ భారత్ అనే అంశం మీద ప్రతీ విద్యార్థి మాట్లాడుతారని, విజేతలను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారని నోడల్ ఆఫీసర్ సాంబశివరావు తెలిపారు వైస్ ప్రిన్సిపాల్ రామ్‌చందర్, అధ్యాపకులు సరిత, స్వాతి పాల్గొన్నారు.

చిల్లపల్లిని సందర్శించిన రాజస్థాన్ బృందం

మంథనిరూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిల్లపల్లి గ్రామ పంచాయతీని గురువారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం ఇటీవల చిల్లపల్లి గ్రామ పంచాయతీకి ఉమెన్ ఫెండ్లీ అవార్డు రావడంతో బృందం గ్రామంలో పర్యటించింది. వీరికి మహిళలు బతుకమ్మలు, కోలాటాలతో స్వాగతం పలికారు. గ్రామంలో జరుగుతున్న అభివద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన విషయాలను వారు పరిశీలించారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

అంతర్గాం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మొగల్ పహాడ్‌లో గురువారం పోచమ్మ తల్లి బోనాలను గ్రామస్థులు నిర్వహించారు. మహిళలు డప్పు చప్పుళ్ళు మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో నెత్తిమీద బోనాలు పెట్టుకొని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. గ్రామస్థులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మటన్ మార్కెట్‌లో అధికారుల తనిఖీలు


కోల్‌సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కళ్యాణ్‌నగర్‌లోని మటన్ మార్కెట్‌లో గురువారం పారిశుద్ధ్య విభాగం తనిఖీలు జరిపింది. నిబంధనలకు విరుద్ధంగా షాపుల వద్ద మేకలను వధిస్తున్నారనే ఫిర్యాదులతో తనిఖీలు జరిపారు. మేకలను వధిస్తున్న ముగ్గురు వ్యాపారులకు జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, సూపర్‌వైజర్లు దయానంద్, సంపత్ పాల్గొన్నారు.

విధులకు హాజరుకాని ఉద్యోగులకు కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా పరిధిలోని వకీల్‌పల్లె గనిలో పనిచేస్తూ విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు గురువారం యాజమాన్యం కౌన్సెలింగ్ నిర్వహించింది. గని మేనేజర్ కార్యాలయంలో 2024లో 100లోపు మస్టర్లు చేసిన 45 మంది, 2025లో ఒక్కసారి కూడా డ్యూటీకి రాని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో మేనేజర్ రవికిరణ్ మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి సక్రమంగా విధులు నిర్వర్తించాలని, ఉద్యోగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఏదైన సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే సహకారం అందజేయనున్నట్టు పేర్కొన్నారు. డీవైపీఎం శ్యాంప్రసాద్, జీఎం కమిటీ సభ్యుడు మామిడి మహేందర్ పాల్గొన్నారు.




వార్షిక లక్ష్యాన్ని సాధించాలి



సమీక్షా సమావేశంలో ఆర్‌జీ-2 జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్‌జీ-2 వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్‌జీ-2 జీఎం బి.వెంకటయ్య అన్నారు. గురువారం ఉత్పత్తి, ఉత్పాదకతపై అధికారులతో సమావేశం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓసీపీ-3, వకీల్‌పల్లి గని ఉత్పత్తికి సంబంధించిన విషయాలపై యంత్రాల పనితీరు, విడిభాగాలు, పని స్థలాల విషయాలను చర్చించారు. ఆయన మాట్లాడు తూ సీఎండీ బలరామ్ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అంకిత భావంతో పనిచేయాలన్నారు. పది రోజులు అప్రమత్తతతో వార్షిక లక్ష్యాలు సాధించాలన్నారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ నరసింహారవు, ఏ. నెహ్రూ, ఎం.రాముడు, ఎర్రన్న, రాజాజీ, సంతోష్‌కుమార్, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, భరత్‌కుమార్, రవికిరణ్, సుభాష్, నర్సింహులు, జనార్ధన్, సునీత, అజీజ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



నియామకపత్రాలు తీసుకున్న వారితో జీఎం, అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల్లో భాగంగా మెడికల్ ఇన్వాలిడేషన్, మరణించిన ఉద్యోగుల వారసులకు గురువారం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య నియామక పత్రాలను అందజేశారు. నియామకపత్రాలు అందుకున్న వారిలో ఇద్దరు మహిళలు ఉండగా, వారికి ఏరియాలో పోస్టింగ్ ఇస్తూ ఆర్డర్లు అందజేశారు. తల్లిదండ్రులు అందించిన ఈ ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం సూచించారు. గైర్హాజరు లేకుండా క్రమశిక్షణతో పని చేసి ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు మురళీకృష్ణ, షరీఫ్ మహమ్మద్, డా. మహిపాల్, పండరీనాథ్, వంశీధర్ పాల్గొన్నారు.